సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 22 । జూన్ । 2024



వర్షాకాలం... వ్యాధుల గాలం

వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు ముప్పేట దాడి చేస్తాయి.. అందుకే పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.


8లో



అన్నింటికీ మూలం శివతత్వం

నమఃశ్శివాయ అనుకుంటే అన్ని వేదాలను చదువుకున్నట్లేనని, అన్ని విద్యలకు మూలం శివుడేనని మహా సహస్రావధాని గరికిపాటి నరసింహారావు అన్నారు.

డెల్టాకు 7,845 క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 7,845 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,180, మధ్య డెల్టాకు 1,565, పశ్చిమ డెల్టాకు 4,100 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

24, 25 తేదీల్లో ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్



ఎల్ఆర్ఆర్ క్రిష్ణన్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) ప్రిన్సిపాల్ ఎల్.ఆర్.ఆర్.క్రిష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల కోసం దరఖాస్తే చేసుకుని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అయిన అభ్యర్థులు పదవ తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఒరిజినల్స్‌తో పాటు ఒక జత జిరాక్స్‌కాపీలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు 24వ తేదీ ఉదయం 9.00గంటలకు జీపీఏ 10 నుంచి 7వరకు ఉండి 1నుంచి 136 వరకు ర్యాంకు గల విద్యార్థులు, మధ్యాహ్నం 1.00గంటకు జీపీఏ 6.8 నుంచి 5.7 వరకు ఉండి 137 నుంచి 270 వరకు ర్యాంకు గల విద్యార్థులు హాజరుకావాలన్నారు. ఈనెల 25వ తేదీ ఉదయం 9.00గంటలకు జీపీఏ 5.7 నుంచి 4.7వరకు ఉండి 271 నుంచి 405 వరకు ర్యాంకు గల విద్యార్థులు, మధ్యాహ్నం 1.00 గంటకు జీపీఏ 4.7 నుంచి 1.6 వరకు ఉండి 406 నుంచి 543 వరకు ర్యాంక్ గల విద్యార్థులు జిల్లా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో హాజరుకావాలన్నారు. ఎటువంటి ఫోన్ కాల్స్, మెసేజీలు రాని అభ్యర్థులు వారి పదవ తరగతి గ్రేడ్ పాయింట్స్ ప్రకారంపైన తెలిపిన తేదీలలో షెడ్యూల్ ప్రకారం తమ సర్టిఫికెట్ కాపీలతో నేరుగా ప్రభుత్వ ఐటీఐ రాజమహేంద్రవరంలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ క్రిష్ణన్ కోరారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



'నన్నయ' వర్సిటీలో యోగా సాధన చేస్తున్న వీసీ పద్మరాజు, ఉద్యోగులు

రాజానగరం: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, అనేక అనారోగ్యాల నుంచి రక్షణ లభిస్తుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యోగాకు సంబంధించిన మూలాలు మనదేశంలోనే ఉన్నాయని, వేద కాలం నుంచి యోగా సాధన ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచనతో 2015 నుంచి ఐక్యరాజ్య సమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా డే గా అమలు చేస్తోందన్నారు. యూనివర్సిటీ నుంచి కూడా యోగా కోర్సును అందిస్తున్నామని వీసీ తెలిపారు. కానవరంలోని రాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో యోగాసనాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు యోగా సాధనలో భాగంగా యోగాసనాలు, ప్రాణాయామం, పిరమిడ్, రాజయోగ వంటి యోగాభ్యాస ప్రక్రియలు ప్రదర్శించారు. సిబ్బంది అంతా కొద్దిసేపు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా 108 యోగాసనాలతో నిర్వహించిన జలదీప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా భూసార పరీక్షల రిపోర్టులు

ఏడీఏ విజయ్‌కుమార్

సామర్లకోట: భూసార పరీక్షల రిపోర్టులను వేగంగా రైతులకు అందజేయాలని ఏడీఏ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు.స్థానిక వ్యవసాయ క్షేత్రంలోని భూసార పరీక్షా కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న భూసార పరీక్ష కేంద్రానికి గుర్తింపు వచ్చే విధంగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 10వేల మట్టి నమూనాలు పరీక్షించినట్టు గుర్తించారు. 2024–25 సంవత్సరానికి వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 17,400 మట్టి నమూనాలు పరీక్ష చేయవలసి ఉండగా ఇప్పటి వరకు చేసిన పరీక్షలపై ఏడీఏ ఆరా తీశారు. మట్టి పరీక్షకు కావలసిన పరికరాలు, విడుదల అయిన నిధులు, భూపరీక్షల నిమిత్తం కావలసిన అదనపు సిబ్బంది, ప్రణాళిక గురించి అడిగి తెలుసుకున్నారు. భూసార పరీక్ష కేంద్రంలో ఉన్న పరికరాలను పరిశీలించి, మట్టి నమూనాల సేకరణ విధానం, భూసార పరీక్ష చేసే విధానాన్ని విజయ్‌కుమార్ పరిశీలించారు.

వరి వడిగా..

- తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఊపందుకున్న వరి నాట్ల ప్రక్రియ
- రంగంపేట, బిక్కవోలు, అనపర్తి, కొవ్వూరులో వెదజల్లు పద్ధతి
- ఇప్పటికే 195 హెక్టార్లలో పూర్తి
- మిగిలిన ప్రాంతాల్లో ముమ్మరంగా నారుమళ్లు
- ఖరీఫ్ సాధారణ వరి సాగు విస్తీర్ణం 77,817 హెక్టార్లు
- నారుమడుల ఆవశ్యకత 3,891
- ఇప్పటి వరకు **57 శాతం పూర్తి**
- నెలాఖరులోగా **మొత్తం పూర్తి చేసేందుకు సన్నాహాలు**



వరి నారుమళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది



చాగల్లు మండలం మల్లవరంలో నాట్లు వేస్తున్న రైతులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఖరీఫ్ సాగు ఊపందుకుంది. పంట సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడడంతో కర్షకులు ఉత్సాహంగా కాడి పట్టేందుకు సమాయత్తమవుతున్నారు. అందుకు అనుగుణంగా గత ప్రభుత్వం సకాలంలో కాటన్ బ్యారేజీ నుంచి ముందస్తుగా సాగు నీటిని విడుదల చేయడం, అవసరమైన మేరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో రైతులు నారుమళ్ల ప్రక్రియను ముమ్మరం చేశారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే వెదజల్లు పద్ధతిలో వరి నాట్లు వేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 195 హెక్టార్లలో నాట్లు పూర్తయినట్టు వ్యవసాయాధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు నారుమళ్ల ప్రక్రియ సైతం ఊపందుకుంది. ఇప్పటికే 57 శాతం పూర్తయింది. ఈ నెలాఖరుకు వంద శాతం పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

195 హెక్టార్లలో నారుమళ్లు

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఒకవైపు నారుమళ్ల ప్రక్రియ సాగుతుంటే.. మరోవైపు నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వెదజల్లే పద్ధతి, సాధారణ పద్ధతుల్లో నాట్లు వేయడంలో రైతులు తలమునకలవుతున్నారు. జిల్లాలో ఇప్పటికే 115 హెక్టార్లలో వెద, 78 హెక్టార్లలో సాధారణ పద్ధతిలో నాట్లు వేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అనపర్తి మండలంలో 9 హెక్టార్లలో వెదజల్లు, 1 సాధారణ, బిక్కవోలులో 15 హెక్టార్లలో వెదజల్లు, 5 హెక్టార్లలో సాధారణ, గోకవరంలో 2 హెక్టార్లలో వెదజల్లు, రంగంపేటలో 85 హెక్టార్లలో వెదజల్లు, చాగల్లులో 10 హెక్టార్లలో సాధారణ, దేవరపల్లిలో 20 హెక్టార్లలో సాధారణ, కొవ్వూరులో 4 హెక్టార్లు వెదజల్లు, 22 హెక్టార్లు సాధారణ, నిడదవోలు 20 హెక్టార్లు సాధారణ పద్ధతిలో నాట్లు వేశారు. వరి సాగులో వెదజల్లే విధానానికి ఆదరణ పెరుగుతోంది. సాగు వ్యయం పరిమితంగా ఉండడం, కూలీల ఖర్చులు తగ్గడం, నీటి తడులు ఎక్కువగా ఇవ్వాల్సిన అవసరం లేకపోవడంతో ఈ విధానంలో సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. ఖరీఫ్, రబీ ఇలా సీజన్ ఏదైనా వెదజల్లుకే రైతులు ఓటు వేస్తున్నారు. డెల్టా, మెట్ట ప్రాంతాలన్న భేదం లేకుండా ఈ పద్ధతికి మొగ్గు చూపుతున్నారు.

ఊపందుకున్న వైనం

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలు 83,068 హెక్టారలో సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనాలు రూపొందించింది. అందులో అత్యధికంగా వరి 77,817 హెక్టార్లలో సాగవుతుంది. ఇందుకు 3,891 హెక్టార్ల నారుమళ్ల అవసరం ఉంది. 2,199 హెక్టార్లలో పూర్తయ్యి 57 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసుకున్నాయి. చాగల్లు మండలంలో 100 శాతం పూర్తయ్యాయి. రాజానగరంలో 93 శాతం, ఉండ్రాజవరం 96, తాళ్లపూడి 73, నిడదవోలు 80, కొవ్వూరు 89, కడియం 69, పెరవలి 66, నల్లజర్ల 61 శాతం నారుమళ్లు పూర్తయ్యాయి. నెలాఖరుకు వంద శాతం పూర్తి కానున్నాయి.

అందుబాటులో విత్తనాలు

ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరి సాగు చేపడతారు. అందుకు అవసరమైన వివిధ రకాల విత్తనాలు సిద్ధంగా ఉంచారు. వరి పంటకు 38,908 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ఇందులో 400 క్వింటాళ్లు ఏపీ సీడ్స్ ద్వారా, 10,000 క్వింటాళ్లను ప్రైవేటు సంస్థల ద్వారా, మిగిలిన వాటిని రైతు నుంచి రైతుకు సరఫరా చేయనున్నారు. భూసారాన్ని పెంపొందించడంలో పచ్చిరొట్ట విత్తనాలు కీలక భూమిక పోషిస్తాయి. పశువుల ఎరువులకు ప్రత్యామ్నాయంగా వినియోగించే విత్తనాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తోంది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా అవసరమైన విత్తనాలు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచింది. 434 క్వింటాళ్ల జీలుగ, 150 జనుము, 30 క్వింటాళ్ల పిల్లిపెసర ముందస్తుగానే అందుబాటులో ఉంచింది. జీలుగ, జనుము విత్తనాలు కిలో రూ.88 ఉండగా.. రూ.44కు, పిల్లిపెసర కిలో రూ.134 ఉండగా రాయితీపై కేవలం రూ.67కే అందజేస్తున్నారు.

సాగునీటి కొరత లేకుండా...

ఖరీఫ్ పంట సాగుకు సాగునీటి ఇబ్బందులు తలెత్తే పరిస్థితి లేదని వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. జిల్లాలో అత్యధిక సాగు భూమి మెట్ట ప్రాంతంలోనే ఉంది. జిల్లా సెమీ డెల్టా సిస్టం కింద ఉండటంతో అంటే 60 శాతం బోరు బావుల నీటితో సాగు చేసుకునే సౌకర్యం ఉండటంతో సాగునీటి సమస్య తలెత్తదన్నది అధికారుల వాదన. జిల్లావ్యాప్తంగా 15 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. బోరు నీటి ద్వారా సాగయ్యే ఆయకట్టుకు సైతం ఈ పథకాలు కొంతమేర నీటిని అందిస్తున్నాయి. ఈ పరిణామం సాగునీటి సమస్యను అధిగమించేందుకు దోహదపడుతోంది.

ఆర్బీకేల్లో ఎరువులు

ఎరువులను గత ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ముందస్తుగా అందుబాటులో ఉంచింది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 58,356 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 23,096 మెట్రికల్ టన్నులు అందుబాటులో ఉంచారు. రైతులు తమకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే), సొసైటీలు, డీలర్ల వద్ద పొందే వెసులుబాటు కల్పించారు.

జిల్లాలో ఇలా...

మండలం	నారుమళ్ల ఆవశ్యకత (హెక్టార్లలో)	పూర్తయిన నారుమళ్లు	పూర్తయిన నాట్లు
రాజమండ్రి రూరల్	76	30	0
కడియం	111	77	0
రాజానగరం	242	225	0
అనపర్తి	191	70	10
బిక్కవోలు	311	90	20
కోరుకొండ	296	60	0
గోకవరం	256	10	2
సీతానగరం	283	55	0
రంగంపేట	143	110	85
చాగల్లు	174	174	10
దేవరపల్లి	186	110	20
గోపాలపురం	207	73	0
కొవ్వూరు	229	205	26
నిడదవోలు	362	290	20
పెరవలి	167	110	0
తాళ్లపూడి	192	140	0
ఉండ్రాజవరం	250	240	0
నల్లజర్ల	215	130	0

నెలాఖరుకు నారుమళ్ల ప్రక్రియ పూర్తి



జిల్లాలో నారుమళ్ల ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ నెలాఖరుకు వంద శాతం ప్రక్రియ పూర్తవుతుంది. వరి నాట్లు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. నారుమడిలో సేంద్రియ ఎరువులు వినియోగిస్తే సత్ఫలితాలు అందుతాయి. ముగగ దమ్ము చేసుకుని దంపు ఆకు మళ్లు పోసుకుంటే 20 రోజుల్లోనే నాట్లకు నారు సిద్ధమవుతుంది. నీటి సమస్య తలెత్తకుండా కాటన్ బ్యారేజీ నుంచి నీటిని ముందస్తుగా విడుదల చేస్తున్నాం. ఎరువులు అందుబాటులో ఉంచాం. ముందస్తుగా సాగును ప్రోత్సహించి రైతులు ప్రకృతి విపత్తులకు పంట నష్టపోకూడదన్న తలంపుతో ముందుకెళుతున్నాం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

డయేరియా నియంత్రణపై ప్రచారం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): డయేరియా నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని, జిల్లాలో ఒక్క డయేరియా కేసు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి, జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్య ఇతర శాఖలతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరు, వైద్య అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాధవీలత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేసిన ఆదేశాలపై సమీక్ష నిర్వహిస్తూ డయేరియాపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కోసం ఇప్పటి వరకూ రెండు వారాల కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం డయేరియా వల్ల ఒక్కరూ కూడా మృత్యువాత పడకుండా చేపట్టవలసిన చర్యలలో భాగంగా రెండు నెలల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో సూక్ష్మ స్థాయి ప్రణాళిక సిద్ధం చేసి నివేదిక అందచేయాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ సప్లిమెంటరీ అందజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఐఈసీ (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) సమాచారం, అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, శుద్ధమైన తాగునీరు, అనుబంధ శాఖల, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మునిసిపల్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉందన్నారు. మలేరియా, డెంగీ, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం చాలా అవసరం అన్నారు. వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వేంకటేశ్వరరావు కమ్యూనిటీ స్థాయి కార్యకలాపాల వివరాలు తెలియజేస్తూ పట్టణ ప్రాంతాల్లో, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచారం చేపట్టేందుకు సమన్వయ శాఖల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

క్విజ్ 2025 బ్రోచర్ ఆవిష్కరించిన కలెక్టర్ మాధవీలత



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్వామి వివేకానంద యువజన సమితి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న క్విజ్ 2025 పోటీల్లో పాల్గొని విద్యార్థులు వారిలోని సృజనాత్మకతను ప్రదర్శించే చక్కటి అవకాశం ఉందని కలెక్టర్ మాధవీలత అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో క్విజ్ 2025 బ్రోచర్‌ను కలెక్టర్ మాధవీలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని సూచించారు. క్విజ్ పోటీలలో జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్, వివేకానంద రచనలపై పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. మూడు కేటగిరీల్లో పాఠశాల స్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు, ఆయా విభాగాల్లో గెలుపొందిన విజేతలకు 2025 జనవరి 12వ తేదీన వివేకానంద జయంతి సందర్భంగా లాప్ టాప్ తదితర బహుమతులు అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమ నిర్వాహకులు ఎస్.రాఘవేంద్రరావు వివరాలు తెలియజేస్తూ వివేకానంద క్విజ్ 2025లో జూనియర్ విభాగంలో 5, 6 తరగతుల విద్యార్థులకు, సీనియర్ విభాగంలో 7, 8 తరగతుల విద్యార్థులకు, మాస్టర్ విభాగంలో 9, 10 తరగతుల విద్యార్థులకు మూడు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. నాలుగు దశల్లో స్క్రీనింగ్, ప్రాథమిక, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ విధానంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తరగతుల విద్యార్థులకు వారి తరగతి సబ్జెక్టులతో పాటుగా జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్, వివేకానంద సాహిత్యం వంటి అంశాల్లో ప్రశ్నలు ఉంటాయని తెలియజేశారు. ఇతర వివరాలకు 94417 81525 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు పాల్గొన్నారు.

ఆ అంకెలు.. ఆపద్బాంధవులు


- కష్టాల్లో ఆదుకునేందుకు 100, 112, 182, 1098
- చిన్నారులు, యువతులు, మహిళలకు వరం
- వీటికి తోడు అతివల సంరక్షణకు దిశ

రాయవరం: ఆ అంకెలు ఆపద్బాంధవులు అవుతున్నాయి.. కష్ట సమయాల్లో ఆదుకునే దేవుళ్లుగా మారుతున్నాయి.. ఆపద వేళల్లో ఈ నంబర్ల ప్రాధాన్యం ఎనలేనిది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నంబర్లతో పాటు వీటినీ విధిగా గుర్తుపెట్టుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అత్యవసర కాల్స్‌కు పోలీసులు అటెండ్ అవుతున్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. కాల్ రావడమే ఆలస్యం ఘటనా స్థలానికి చేరుకుంటున్నారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ఆపద సమయాల్లో మనం చేయాల్సిందల్లా ఒకే ఒక్క పని.. సంకోచించకుండా ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్ చేయడమే. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడానికి చిన్నారులు, యువతులపై లైంగిక దాడులు జరిపే నేరస్తుల పని పట్టడానికి ఈ నంబర్లు ఎంతో ఉపయుక్తం. 24 గంటలూ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు కొన్ని ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్లు ప్రవేశ పెట్టాయి. అవి ఏంటో తెలుసుకుందాం రండి..

100కు వందనం

ఎప్పటి నుంచో అందుబాటులో ఉన్న నంబరు 100. దీనికి కాల్ చేస్తే నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. బాధితులు తమ పరిస్థితి వివరించాక అక్కడి నుంచి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లైన్ కలిపి అక్కడ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. జీపీఎస్ లోకేషన్ ఆధారంగా సమీపంలోని పోలీసులు, గస్తీ వాహనాలను అప్రమత్తం చేయడమే కాకుండా బాధితురాలు ధైర్యంగా ఉండేలా పలు సూచనలు చేస్తారు. పది నిమిషాల్లో అక్కడకు చేరుకుంటారు.



1091:

మహిళలను అత్తింటివారు, భర్త హింసించడం, కొట్టడం వంటివి చేస్తే 1091కు కాల్ చేస్తే నేరుగా మహిళా సెల్‌కు కనెక్ట్ అవుతుంది. అంతేకాకుండా మహిళలపై దాడికి పాల్పడినప్పుడు ఎవరైనా బయట వ్యక్తి చూసినా ఈ నంబరు కు కాల్ చేయవచ్చు. పిల్లలను హింసించినా సాయం కోరవచ్చు.

182



ఈ అంకె రైల్వే డివిజన్ పరిధిలోని ఆర్పీఎఫ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. ఎవరైనా రైళ్లలో ప్రయాణించేటప్పుడు లైంగిక వేధింపులకు గురైనా, దొంగతనాలు, ఆపదలో ఉండే సందర్భాల్లో ఈ నంబరుకు కాల్ చేయవచ్చు. బాధితులు ప్రయాణిస్తున్న సంబంధిత రైలులో ఉండే ఆర్పీఎఫ్ పోలీసులకు కంట్రోల్ రూమ్ నుంచి మెసేజ్ వెళ్తుంది. వెంటనే బాధితులున్న బోగీల్లో పోలీసులు అప్రమత్తమై సమస్యను పరిష్కరిస్తారు.

91212 11100:

మహిళలు ముఖ్యంగా యువతులపై జరిగే సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర పేరిట వాట్సప్ నంబరు 91212 11100ను ఏపీ పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. ఆపదలో ఉండి అత్యవసర పరిస్థితుల్లో ఈ నెంబరుకు మెసేజ్ పంపిస్తే పోలీసులు అప్రమత్తమవుతారు. ఈ నంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

మహిళల భద్రతకు చర్యలు



మహిళల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. మహిళలను వేధించే వారిపై ప్రస్తుత చట్టాలు కఠినంగా ఉన్నాయి. ప్రజలు ఆపద సమయాల్లో ఎమర్జెన్సీ నంబర్లను వినియోగించుకోవడం ద్వారా రక్షణ పొందవచ్చు. ప్రజల ఆస్తులు, ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు ఎప్పుడూ ముందు వరసలో ఉంటారు.

– బి.రామకృష్ణ, డీఎస్పీ, రామచంద్రపురం

దిశ యాప్ అండగా..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌పై ప్రజల్లో నమ్మకం పెరిగింది. ఈ యాప్‌లో ఎస్ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే చాలు ఆపదలో ఉన్న సంకేతాలు నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరి వెంటనే పోలీసులు అలెర్ట్ అయ్యి సమస్యను పరిష్కరిస్తారు.

112



గతంలో మహిళల సమస్యలపై నేరుగా 100కు డయల్ చేస్తే పోలీసు యంత్రాంగం వెంటనే అప్రమత్తమయ్యేది. ఇప్పుడా నంబరుకు అన్ని రకాల ఫిర్యాదులు ఎక్కువ కావడంతో మహిళల సౌలభ్యం కోసం ప్రత్యేకించి 112 నంబరును కేంద్ర హోం శాఖ ప్రవేశపెట్టింది. బాధితులు దేశంలో ఎక్కడి నుంచైనా ఈ నెంబర్‌కు కాల్ చేస్తే చాలు. వారికి సంబంధించిన రాష్ట్రంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. దీనికంటూ 112 మొబైల్ యాప్ కూడా ఉంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చెముడులంకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సుబ్బారావు

ఆలమూరు: చెముడులంక 216వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గల్లా సుబ్బారావు (55) మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సుబ్బారావు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి రావులపాలెం వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావుకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు క్షణాల్లో వచ్చినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్లు హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న కారు: వ్యక్తి మృతి



ఈశ్వరరావు మృతికి కారణమైన కారు

ఐ.పోలవరం: మోటార్ సైక్లిస్టును కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున కొమరగిరి 216వ జాతీయ రహదారిపై యానాం నుంచి ముమ్మిడివరం బైక్‌పై వస్తున్న కముజు ఈశ్వరరావు (59)ను వెనుక నుంచి తెలంగాణకు చెందిన కారు ఢీకొంది. ఈశ్వరరావును కారు ఈడ్చుకు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. సంఘటనా స్థలానికి ఎస్సై జె.భానుప్రసాద్ చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె, అల్లుడు విశాఖపట్నంలో ఉండడంతో వారి ఇంటికెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఈశ్వరరావు ప్రమాదానికి గురయ్యాడు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె.భానుప్రసాద్ తెలిపారు.

వర్షాకాలం... వ్యాధుల గాలం

- పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే అపాయం
- 1962 ఫోన్ చేస్తే ఇంటి వద్దే వైద్యం



ఆవుకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు

కాకినాడ సిటీ: వర్షాకాలం వచ్చిందంటే చాలు వ్యాధులు ముప్పేట దాడి చేస్తాయి.. ఈ కాలంలో పశువుల సంరక్షణ చర్యలు ఎంతో అవసరం.. అందుకే పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధి సోకినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా సమీపంలోని పశు వైద్యశాలను సంప్రదించాలని చెబుతున్నారు. ఒకవేళ జీవం పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా, ఆసుపత్రికి తరలించలేని పరిస్థితిలో ఉన్నా 1962కు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వచ్చి పశు వైద్యులు సేవలు అందిస్తారు. పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశు వైద్యశాలకు తరలిస్తారు.

నట్టలతో ఎదుగుదలకు బ్రేక్

గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెలు తిన్న ఆహారమంతా నులి పురుగులే తినేయడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు నట్టల వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పచ్చిమేత పెరుగుతూ ఉంటుంది. అది తిన్నప్పుడు సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది.

గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముఖ్యంగా జూన్, జులై నెలల్లో (హెచ్ఎస్) టీకాలు వేస్తారు.

పాడి-పంట

వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

వ్యాక్సిన్‌తో చిటుకుకు చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకు. ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని నివారణ కోసం జూన్, జులై మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించిన వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందిస్తే వాటిని వ్యాధుల నుంచి సంరక్షించుకోవచ్చు.



గాలికుంటు వ్యాధి సోకిన పశువు గిట్ట

ఆలస్యం చేయరాదు..



పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకూ ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో 1962కు కాల్ చేస్తే సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందిస్తారు. ఎలాంటి సందేహాలున్నా రైతులు పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించవచ్చు. –సూర్యప్రకాశరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, కాకినాడ

కాకినాడ జిల్లాలో పశువులు

ఆవులు	76,502
గేదెలు	2,82,273
గొర్రెలు	1,41,229
మేకలు	1,01,870
కోళ్లు	92,48,636

గాలికుంటుతో నీరసం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉంటుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగ్గా తీసుకోలేవు. నీరసించి, నడిచేందుకూ ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

పీడించే జలగ

మురుగునీరు, కాలువల్లో అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల జలగ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులు మేత మేయడంలో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 10 మిల్లీలీటర్ల నీయోజడ ప్లస్‌ను అందించాలి.

కనులవిందుగా కనకధారా కళారూపం

- 16,200 సార్లు కళాకారుల నృత్య నీరాజనం
- 13 గంటలు నిర్విరామంగా ప్రదర్శనలు



కనకధార స్తోత్రం కళారూపాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శ్రీకనకధారా స్తోత్రం గోదావరి తీరంలో మార్మోగింది. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 150 మంది నృత్య కళాకారులు ఒకే ఆహార్యంలో కనకధారా స్తోత్రాన్ని కథారూపకంగా 16,200 సార్లు ప్రదర్శించారు. ఈ నృత్య రూపకం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్విరామంగా సాగింది. శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం, శ్రీరాధాకృష్ణ ట్రస్టు ద్వారా అంతర్జాతీయ సంగీత పోటీలు, ప్రదర్శనలు రెండో రోజు కూడా కొనసాగాయి. రాజమహేంద్రవరం ఆనంకళా కేంద్రంలో నగరపాలక సంస్థ, గెయిల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కళా సమ్మేళన్ నిర్వహించారు. దీనికి బెంగళూర్, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మలేషియా, యూఎస్ నుంచి కళాకారులు వచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ మాట్లాడుతూ నేటి తరానికి కళల ప్రాధాన్యం తెలియడం లేదని, శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం వంటి వాటిని విస్మరించారన్నారు. నేటి తరానికి నృత్యం గొప్పదనం తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కళాసమ్మేళన్ ఏర్పాటు చేశామన్నారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో కళలకు ఆదరణ, గౌరవం ఉందని, అందుకే ఇంత దిగ్విజయంగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

ఆకట్టుకునేలా నృత్య ప్రదర్శనలు

సాక్షాత్తు అమ్మవారిని సైతం మెప్పించి, అనుగ్రహం పొందే విధంగా కళాకారులు తమ నృత్య ప్రదర్శనతో వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఒక బృందం తరువాత మరో బృందం కనకధారా స్తోత్ర శ్లోకానికి నృత్యాభినయం చేయడంతో శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రం చప్పట్లతో మార్మోగింది. 13 గంటలు నిర్విరామ ప్రదర్శనతో అమ్మవారికి నృత్య నీరాజనం చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నృత్య రూపకం ఆకట్టుకుంది. శని, ఆదివారాలు జావళీలను కళాకారులు ప్రదర్శించనున్నారు. కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, సంగీతం తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తారు. కార్యక్రమంలో బీవైఎస్ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ రోషన్ గుప్తా, బీఐఎస్ఎస్ మహిళా మోర్చా అధ్యక్షురాలు రాజ్‌బాల సింగ్, జి.ఉమాజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



నృత్య రూపకం చేస్తున్న లక్ష్మీదీపిక

అవయవదానంపై అక్కాచెల్లెళ్ల ప్రచారం



అవయవదానంపై అక్కాచెల్లెళ్లు వేసిన ఆర్ట్‌ను ఆవిష్కరించిన డీవైఈఓ నరసింహఫణి

1.50 లక్షల అగ్గిపుల్లలతో చిత్రాల రూపకల్పన

రాయవరం: రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడి మరణిస్తున్నారు. ఎందరో బ్రెయిన్ డెడ్‌కు గురవుతున్నారు. అటువంటి పరిస్థితుల్లో ఉన్నవారి అవయవాలను దానం చేసేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అక్కాచెల్లెళ్లు ముందుకు సాగుతున్నారు. స్వర్ణలత ఇంటర్ సెకండియర్, బాలసాయివైష్ణవి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. వీరు రామవరంలోని డ్రాయింగ్ ఇనిస్టిట్యూట్‌లో చిత్రలేఖనంలో తర్ఫీదు పొందుతున్నారు. కాగా అవయవదాన ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలనే తలంపుతో అవయవదానం.. మహాదానం పేరుతో అగ్గిపుల్లలతో అవయవాల ఫొటోలను రూపొందించారు. అనపర్తి మండలం రామవరం డ్రాయింగ్ టీచర్ మందపల్లి సత్యానందం పర్యవేక్షణలో ఈ అక్కాచెల్లెళ్లు 30 రోజులు కష్టపడి 1.50 లక్షల అగ్గిపుల్లలను ఉపయోగించి 13 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తుతో ఈ చిత్రాలను రూపొందించారు. అవయవాలైన గుండె, ఊపిరితిత్తులు, లివర్, జీర్ణవ్యవస్థ, కళ్లు, ఎముకలు, ప్రాంక్రియాసిస్ చిత్రాలతో పాటు, అవయవాలు ఫెయిల్యూర్ అయిన వారి ఫొటోలను కూడా రూపొందించారు. కార్డు బోర్డుపై ఈ చిత్రాలను అగ్గిపుల్లలతో అమర్చారు. గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు వీరి ప్రతిభను పంపించనున్నట్లు డ్రాయింగ్ టీచర్ సత్యానందం తెలిపారు. అక్కాచెల్లెళ్లు స్వర్ణలత, బాలసాయివైష్ణవి, డ్రాయింగ్ టీచర్ సత్యానందం, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, నాగిరెడ్డిలను రామచంద్రపురం డీవైఈఓ శ్రీపాద నరసింహఫణి, హెచ్ఎం వీఎస్ సునీత, ఎంఈఓలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ అభినందించారు.

అన్నింటికీ మూలం శివతత్వం

ఆధ్యాత్మికవేత్త పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు

మండపేట: నమఃశ్శివాయ అనుకుంటే అన్ని వేదాలను చదువుకున్నట్లేనని, అన్ని విద్యలకు మూలం శివుడేనని మహా సహస్రావధాని, ఆధ్యాత్మికవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికిపాటి నరసింహారావు అన్నారు. మండపేట సీతారామ కమ్మ కల్యాణ మండపంలో శివతత్వంపై ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గరికిపాటి నరసింహారావు మూడు రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక ప్రవచనాలను శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు కార్యక్రమాన్ని కల్యాణ మండపం కమిటీ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శివతత్వానికి సంబంధించి సంస్కృతంలో ఉన్న శ్లోకాలను చదువుతూ వాటికి అర్థాన్ని చెప్పారు. అన్నింటికీ మూలం శివుడేనని, మహా శివుని ఆరాధించే వారికి ఎప్పుడూ ఆయన ఆశీస్సులు ఉంటాయని పురాణ ఇతిహాసాల్లోని కొన్ని ఘట్టాలను తెలియజేశారు. శివతత్వాన్ని అలవర్చుకునే వారు సద్గుణాలు కలిగి ఉంటారని చెప్పారు. అటువంటి వారివల్ల కుటుంబాలు, సమాజం, సన్మార్గంలో నడుస్తాయన్నారు. మధ్య మధ్యలో చలోక్తులతో సభికులను నవ్వించారు. అలాగే మనుషులు పదిమందిలో ఉన్నప్పుడు చూపును, నలుగురిలో ఉన్నప్పుడు మాటను, ఏకాంతంగా ఉన్నప్పుడు మనసును పరిశీలించుకుంటే అటువంటి వారు మంచి వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారని వివరించారు. భగవత్ ఆరాధనలో ఉన్నవారికి ఎప్పుడూ మంచే జరుగుతుందన్నారు. సుమారు రెండు గంటల పాటు మొదటి రోజు ఆధ్యాత్మిక ప్రవచనం సాగింది. మండపేట పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు విచ్చేసి ఈ ఆధ్యాత్మిక ప్రసంగాన్ని ఆలకించారు. కల్యాణ మండపం కమిటీ సభ్యులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



ప్రవచనాలను ఆసక్తిగా వింటున్న మహిళలు



శివతత్వంపై ప్రవచిస్తున్న నరసింహారావు

గడువు దాటితే ముప్పే

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



గ్యాస్ సిలిండర్‌లు

అంబాజీపేట: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో... సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాల పరిమితి ఉంటుందని, దానిని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతీ సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్ విధానంలో మెటల్ ప్లేటుపై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకొని వినియోగించాలి.

ఇలా గుర్తించాలి..

సిలిండర్ మెటల్ ప్లేటుపై ఏ-24, బీ-24 అని ఉంటే ఆ సిలిండర్ 2024 మార్చి–జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 24 అంటే 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ‘ఏ’ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు ‘బీ’ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, ‘సీ’ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, ‘డీ’ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది. సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేటుపై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని గమనించాలి. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దానిని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

సిలిండర్‌కు 10 ఏళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి 10 ఏళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తర్వాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

వినియోగదారుల హక్కులు..

గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు హక్కులు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు. కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అయితే డీలర్ వద్ద కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు. గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి



మురళీకృష్ణ

మండపేట: మండపేట పట్టణానికి చెందిన పినిపే మురళీకృష్ణ (25) గడ్డి మందు తాగి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. తరచూ మద్యం తాగుతుండడంతో మురళీకృష్ణను తల్లిదండ్రులు మందలించారు. వారిని భయపెడదామనే ఉద్దేశంతో మురళీకృష్ణ ఈ నెల 19న గడ్డి మందు తాగాడు. వెంటనే మురళీకృష్ణను అతని సోదరుడు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు.

30న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా చదరంగం సంఘం, కాల్యుష్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 30న మూడో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ శ్రీసరస్వతి ఎడ్యుకేషనల్ అకాడమీ (హుకుంపేట)లో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం టోర్నమెంట్ నిర్వాహకుడు విత్తనాల కుమార్ తెలిపారు. చిన్నపిల్లల దగ్గర్నుంచి పెద్దల వరకూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ప్రతిభ కనబరిచిన 30 మందిని విజయవాడలో జూలై 12 నుంచి 14 వరకూ జరిగే జాతీయస్థాయి ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు 95055 42888 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.


యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: స్థానిక గౌతమీనగర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి ఎదురు వీధిలో నివాసం ఉంటున్న కట్టుంగ రాజశేఖర్ (26) శుక్రవారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందారు. శారద కాన్వెంట్‌లోని ఒక గదిలో కొంతకాలంగా అతను అద్దెకు ఉంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. అతను ఆటోడ్రైవర్‌గా, డేకరేషన్ పనులు చేస్తూ ఉండేవాడు. శుక్రవారం ఉదయం గదిలో ఫ్యాన్‌కు రాజశేఖర్ ఉరి వేసుకుని మృతిచెందాడు. అతను చెడు స్నేహాలతో తిరుగుతూ తాగుడికి బానిసైనట్లు మృతుడి మేనమామ, అక్క భర్త శంకవరపు శ్రీను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో రెండు సార్లు తాగిన మైకంలో ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు తెలిపారు.

రైల్వేట్రాక్‌పై శిశువు మృతదేహం

నిడదవోలు: నిడదవోలు రైల్వే స్టేషన్ సమీపంలో యార్డ్ వద్ద రైలు పట్టాలపై రోజుల వయస్సున్న ఆడ శిశువు మృతదేహాన్ని శుక్రవారం గుర్తుంచారు. ఈ విషయాన్ని రైల్వే మేనేజర్‌కు కీమెన్ చెప్పారు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేపట్టారు. శిశువు మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఆడ శిశువు మృతదేహాన్ని ఎరుపు రంగు చున్నీతో చుట్టి పసుపు రంగు బొమ్మల డిజైన్ బేబీ కేరింగ్ కవర్‌లో ఉంచి పట్టాలపై పడేశారు. ఏదైనా ఆసుపత్రిలో చనిపోయిన శిశువు మృతదేహాన్ని పట్టాలపై పడేశారా, లేదా ఆసుపత్రిలో శిశువును అపహరించి చనిపోయిన తరువాత పడేశారా అనే కోణంలో విచారణ చేపట్టారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఎవరికైనా తెలిస్తే 94906 17090, 70133 60296 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

కడలిపై కారు మబ్బు



ఉప్పాడ సాగర తీరంలో కమ్ముకున్న కారు మబ్బులు

పిఠాపురం: నిండు కుండలా ఉన్న కడలిపై కారుమబ్బులు కమ్ముకున్న దృశ్యం ఉప్పాడ సముద్ర తీరంలో శుక్రవారం కనువిందు చేసింది. సముద్రంపై పట్టపగలే కటిక చీకటిని తీసు కొచ్చిన కారు మబ్బులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. వాతావరణ మార్పులతో సముద్ర తీరం ఆహ్లాదాన్ని పంచింది.

యువతకు ఉద్యోగావకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, తిరుపతి శ్రీసిటీ అల్ఫామ్ ఆధ్వర్యంలో డిప్లొమా- మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, ఆటో మొబైల్‌తో పాటు, ఐటీఐ చదివిన వారికి శ్రీసిటీ అల్బమ్స్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల వయసు 18 నుంచి 22 ఏళ్లలోపు ఉండాలన్నారు. జీతం ఏడాదికి రూ.2,55,000, సైట్ అలవెన్స్ రూ.50 వేలు ఉందన్నారు. బెనిఫిట్స్-ఫ్రీ ఫుడ్ అండ్ ట్రాన్స్పోర్టేషన్, 14 రోజుల వసతి సౌకర్యం ఉంటుందన్నారు. అదే విధంగా రూ.6 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్ కవరేజీ ఇస్తారన్నారు. 45 రోజుల పాటు ట్రైనింగ్ ఉంటుందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు https://forms.gle/iSYZZSk8Hb16DmoH7 వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేదీలోగా వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డిస్ట్రిక్ట్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రియ 73967 40041, టోల్ ఫ్రీ నంబర్ 99888 53335లో సంప్రదించాలని కోరారు.